

చిన్నారి వైద్యానికి రూ.20 వేల సాయం

ప్రజాశక్తి-కడియం

చిన్న వయసులోనే ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న మండపేటకు చెందిన నేలపు అమ్మతవర్షిణికి కడియపులంక జనసేన నాయకులు రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. వర్షిణి సికిల్ సెల్ బీటా తలసేమియాతో బాధపడుతోంది. ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి హైదరాబాద్ అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ వద్దకు పంపించారు. పాపకు 15 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత మాత్రమే చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం సిఎంసిఎస్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వర్షిణికి ప్రతి ఆరు నెలలకు సుమారు రూ.25 వేలు వైద్యానికి ఖర్చు అవుతుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, జనసేన నాయకులు గట్టి సుబ్బారావు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో మల్లు బాబి, బోడపాటి తాతారావు పాల్గొన్నారు.

అధికార పార్టీ అడ్డదారులు

- ఎంఎల్‌సి ఎన్నికల్లో పైచేయి కోసం విశ్వ ప్రయత్నాలు
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సన్నాహాలు
- దూర ప్రాంత ఓటర్లతో మంతనాలు
- ఓటు వేసి వెళ్లేందుకు టిక్కెట్లు ఏర్పాటు చేస్తున్న వైనం



దూరప్రాంత ఓటర్ల వివరాల కోసం పంపుతున్న క్యూఆర్‌కోడ్‌తో ఉన్న పోస్టు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో పాలక కూటమి ఎదురీదుతోంది. ఏదోరకంగా గట్టెక్కాలని టిడిపి అభ్యర్థిగా ఉన్న పేరాబత్తుల రాజశేఖర్ ప్రయత్నం చేస్తున్నారు. దానికి తగ్గట్టుగా అన్ని రకాలుగా అధికార దుర్వినిగానికి యత్నిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఇప్పటికే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. పట్టభద్రుల స్థానానికి ఈనెల 27న పోలింగ్ జరగనుంది. బరిలో 35 మంది అభ్యర్థులున్నారు. 3,14,984 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 440 పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేశారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారానికి తెరపడనుంది.

అధికారాన్ని ఉపయోగించుకుని...

అధికారాన్ని ఉపయోగించుకుని ఓటర్లను అన్ని రకాలుగా ప్రభావితం చేసేందుకు కూటమి అభ్యర్థి సన్నాహాలు షురూ చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. నామినేషన్ పత్రాల ఆమోదం నుంచి ఈ వ్యవహారం మొదలైపోయింది. నామినేషన్ ప్రక్రియ నాడే అధికార దుర్వినియోగం జరిగింది. నామినేషన్ వేసేందుకు ఏలూరు కలెక్టర్ కార్యాలయంలోకి టిడిపి, జనసేన పార్టీల మంత్రులు, ఎంఎల్‌ఎలు, నాయకులు చొరబడినప్పటికి అడ్డుకోకపోవడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. పోలింగ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసే రీతిలో పలుచోట్ల హామీలను గుప్పిస్తున్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగా మొత్తం టిడిపి ఎంఎల్‌ఎలు అంతా రంగంలోకి దిగారు. జనసేన, బిజెపి నేతలు కూడా అధికార పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కొన్ని చోట్ల బ్యానర్లు, ఫ్లెక్సీలు యథావిధిగానే దర్శనమిస్తున్నాయి. అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ తమ ప్రచారానికి వినియోగించుకుంటున్న వైనంపై అనేక రకాలుగా ఫిర్యాదులు వస్తున్నాయి.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న హామీలపై కూడా ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. ఇదే సమయంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సుదూర ప్రాంతాలలో ఉన్న వారికి గేలం వేస్తున్నారు. వారితో మంతనాలు సాగిస్తూ రవాణా ఛార్జీల కోసం టిక్కెట్లు తీస్తున్నారు. బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన ఓటర్ల వివరాలను ఇప్పటికే సేకరించిన కూటమి అభ్యర్థి వారికి టిక్కెట్లు తీసి ప్రలోభ పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పోటీలో ఉన్న రాజమండ్రికి చెందిన ఒక అభ్యర్థి ఇప్పటికే విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దూరప్రాంత ఓటర్ల కోసం ఒక క్యూఆర్ కోడ్‌తో ఉన్న పోస్టును పంపుతున్నారు.

గతంలో కూడా గోదావరి జిల్లాల్లో శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రులను ప్రలోభ పెట్టడానికి చేసిన ప్రయత్నాలన్నీ బెడిసి కొట్టాయి. పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడానికి పనితీరుతో మెప్పించాలి తప్ప ఇతర రూపాలలో వాళ్లను ప్రలోభ పెట్టాలని చేసిన అన్ని రకాల యత్నాలు కూడా తిప్పి కొట్టారు. గతంలో చైతన్య రాజు, అంతకుముందు ఎంఎల్‌సి అభ్యర్థులు చేసిన ప్రయత్నాలకు అధికార పార్టీ అభ్యర్థి కూడా దిగడంతో కూటమి నేతల వ్యవహార శైలిపై పట్టభద్రుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

దీనిని అడ్డుకుని తీరతామని ఇప్పటికే పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా చెబుతున్నారు. ఇలా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నా సరే వెనక్కి కూటమి నాయకులు వెనక్కి తగ్గడం లేదు. దీంతో ఇది మరింత దుమారం రేపుతోంది. పట్టభద్రులను ఈ రీతిలో ప్రలోభ పెట్టాలని ధోరణిపై అందరిలోనూ అసహనం వ్యక్తమవుతోంది. ఇది అధికార పార్టీ కూటమికి అసలుకే ఎసరు పెట్టేంచేలా ఉందని ఆయా పార్టీల నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కూటమిలో జనసేన, బిజెపి నేతలు కొన్నిచోట్ల సహాయ నిరాకరణ చేస్తున్నారు. మరికొన్నిచోట్ల సిట్టింగ్ ఎంఎల్‌ఎలు కూడా అంటీఅంటనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రలోభాలపై ఆధారపడ్డారనే వార్తలు వినిపిస్తున్నాయి.


మాట్లాడుతున్న కోదండరామ్

ఖాళీల భర్తీ కోసం ఎల్‌ఐసి సిబ్బంది సమ్మె

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ రోజు ఎల్‌ఐసి రాజమహేంద్రవరం డివిజన్‌లో ఉన్న 20 శాఖ కార్యాలయాల్లో ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగులు 1 గంట వాక్ ఔట్ సమ్మెలో పాల్గొన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి డివిజన్, ప్రధాన కార్యదర్శి ఎం. కోదండరామ్ మాట్లాడుతూ ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఎఐఐఇఎ) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా, అన్ని ఎల్‌ఐసి కార్యాలయాల్లో భోజన విరామ సమయానికి ముందు గంట పాటు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ఎల్‌ఐసిలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగుల నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. ఎల్‌ఐసి సంస్థలో ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు ట్రేడ్ యూనియన్‌గా వెంటనే గుర్తింపు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. ఎల్‌ఐసిలో 2020లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో భర్తీ కాకుండా ఖాళీగా ఉన్న 2,700 ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం, మేనేజ్‌మెంట్‌తో అవసరమైనప్పుడు చర్చల నిమిత్తం, యూనియన్‌కు అధికారిక గుర్తింపు కూడా ఇవ్వాలన్నారు. స్థానిక మోరంపూడి ఎల్‌ఐసి ,రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యాలయం ముందు జరిగిన ఈ నిరసన ప్రదర్శనకు అధ్యక్షులు మాధ్యూస్ అధ్యక్షత వహించారు. మాధ్యూస్ మాట్లాడుతూ ఎల్‌ఐసిలో నియామకాలు లేక ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిపోయిందన్నారు. యూనియన్ నాయకులు గన్నియ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసిని రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జి.శ్రీనివాస్, సత్యదేవ్, ఈశ్వర రావు, విశ్వనాథ్, బి.శ్రీనివాస్, పట్నాయక్, ఇమ్రాన్, సాయిబాబా, డి.శ్రీనివాస్, జిలానీ,మహిళా ఉద్యోగులు కస్తూరి శిరీష, విజయదుర్గా, శ్రావణశ్రీదేవి, రాజ్యం, డివిజన్ జాయింట్ సెక్రటరీ పిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

గోకవరం : దేశ వ్యాప్తంగా జీవిత బీమా సంస్థలో మూడు, నాలుగు తరగతుల ఉద్యోగులు గోకవరం ఎల్‌ఐసి కార్యాలయం ఆవరణలో గురువారం ఒక గంట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా గోకవరం బ్రాంచ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె.మురళీకృష్ణప్రసాద్, కార్యదర్శి ఎం.రవీంద్ర మాట్లాడారు. ఖాళీగా ఉన్న క్లాస్ 3,4 ఉద్యోగ నియామకాలు తక్షణమే చేపట్టాలన్నారు. ఇన్సూరెన్స్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. ఇన్సూరెన్స్‌పై జిఎస్‌టిని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి జి.రాధాకృష్ణ, కోశాధికారి డి.లీలాకృష్ణ, ఇ.లక్ష్మి, పద్మలత, అనూష పాల్గొన్నారు.


గోకవరం సమ్మెలో పాల్గొన్న ఎల్‌ఐసి ఉద్యోగులు

నన్నయ విసిగా ప్రసన్నశ్రీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు విశ్వవిద్యాలయం ఆచార్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారంలో నన్నయ విగ్రహానికి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎన్‌సిసి విద్యార్థుల గార్డ్ ఆఫ్ హానర్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా విసి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఉపకులపతిగా నియమించిన గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరం కోడల్ని ఈ ప్రాంత విశ్వవిద్యాలయానికి వీసీగా రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. చదువుకోవడమే కష్టంగా ఉన్న గిరిజన ప్రాంతం నుంచి వచ్చి ఎన్నో కష్టాలను అధిగమించి 23 ఏళ్ల పాటు ప్రొఫెసర్ పనిచేశానన్నారు. నేడు విసి స్థాయికి ఎదిగానన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛాలతో ఆమెకు అభినందనలు తెలిపారు.


విసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసన్నశ్రీ

షేక్‌హుస్సేన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ హుస్సేన్ జహ అకాల మరణం పార్టీకి తీరని లోటు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడవరపు భద్రందొర అన్నారు. హుస్సేన్ పార్థివ దేహనికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు జహ కాంగ్రెస్ పార్టీ తరపున రెండుసార్లు కౌన్సిలర్‌గా పోటీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, అగర్వాల్ హీరా లాల్, జివివి.సత్యనారాయణ, షేక్ చిన్నజిలాని, మహ్మద్ జమీర్ రహ్మాన్‌ఖాన్, షేక్ కాసిం, మహ్మద్ అన్వర్ ఖాన్, భావన రమేష్, పుచ్చ కాయల వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ముద్రగడ

ప్రజాశక్తి - తాళ్లపూడి

వైసిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం గురువారం కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలో జరిగిన వైసిపి యువజన విభాగం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పి.నాని వివాహ వేడుకల్లో ముద్రగడ పాల్గొన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో వైసిపి నాయకులు ముదునూరి నాగరాజు వివాహ వేడుకల్లో పద్మనాభం పాల్గొన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, తోట రామకృష్ణ, ఎన్.సురేష్, వల్లభశెట్టి శ్రీను, వనిమిరెడ్డి శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి ఫేకల్టీ డెవలప్ మెంట్ అకాడమీ హాల్లో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం అందుబాటులో ఉండాలనే ఆశయంతో 1987లో న్యాయ సేవాధికార సంస్థ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. మహిళలు, వృద్ధులు సంవత్సరానికి రూ.3 లక్షల ఆదాయంలోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సంస్థ ద్వారా న్యాయం పొందడానికి అర్హులన్నారు. ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. ఎన్ని చట్టాలు, ఎన్ని సంస్కరణలు చేసినా, సంఘంలో మహిళల స్థితి ఆశించిన రీతిలో లేదన్నారు. ఇంకా వారిపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులు వారి జీవిత పురోగమనానికి, వారే బాధ్యత తీసుకోవాలన్నారు. మొబైల్ ప్రయోజనాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుర్వినియోగం చేసిన వారు మూల్యం చెల్లించక తప్పదన్నారు. మంచి లక్ష్యాన్ని నిర్ణయించుకుని దాని సాధనకు కృషి చేయాలన్నారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి మాట్లాడుతూ సామాజిక న్యాయం అందరికీ అందాలనే ఆశయంతో పేద బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నాయన్నారు. విద్యార్థినులు సంక్షేమ హాస్టల్స్‌లో చక్కగా చదువుకుంటూ, క్షేమంగా ఉండగలుగు తున్నారన్నారు. ఉన్నత స్థానాలను అందుకుంటూ తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమాన్ని డిఎల్‌ఎస్‌ఎ ప్యానెల్ లాయర్ దేవిక నిర్వహించారు. డిటిడబ్ల్యూఒ కెఎన్.జ్యోతి, డిబిసిడబ్ల్యూఒ బి.శశాంక, డిబిడబ్ల్యూ రాజు, ఎఎస్‌డబ్ల్యూ ప్రసాద్, స్థానిక హెచ్‌డబ్ల్యూలు, హాస్టల్ విద్యార్థినులు, లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.




నేటి నుంచి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు

ప్రజాశక్తి - గోపాలపురం

నేటి.నుండి రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు చిట్యాలజిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మీనరసింహశాస్త్రి తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ క్రీడలకు ముఖ్య అతిథులుగా డిఇఒ వాసుదేవరావు, డివైఇఒ రామన్నదొర పాల్గొంటారని తెలిపారు. చిట్యాల హైస్కూల్ క్రీడా మైదానంలో 42వ రాష్ట్ర స్థాయి మహిళ, పురుషుల టెన్నికోయిట్ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు హెచ్‌ఎం శ్రీలక్ష్మీనరసింహ శాస్త్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే చంద్రశేఖర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల, కర్నూలు, అనంతపురం, కడప, గుంటూరు నెల్లూరు, జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. దాతల సహకారంతో క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీలు డే అండ్ నైట్ జరుగుతాయన్నారు. 22వ తేదీన ముగుస్తాయన్నారు. పేరం రవీంద్ర, మార్లపూడి లక్ష్మణరావు పర్యవేక్షిస్తారాన్నరు. విజేతలు జాతీయ, అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.


విలేకర్ల సమావేశంలో పాల్గొన్న హెచ్‌ఎం, నిర్వాహకులు



ఉద్భవ్-2025 వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ -2025 వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసే విధంగా ఉద్భవ్ - 2025 ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌జెడి శోభారాణి విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. విద్యార్థులకి అభినందనలు తెలియజేశారు. ఆర్‌డిఒ కృష్ణనాయక్ మాట్లాడుతూ విద్యారుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలకు ఇది చక్కని వేదిక అన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ అనేక రకాల సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనలు, ఆహార పదార్థాల, వస్తువుల స్టాల్స్, వివిధ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఇతర కళాశాల విద్యార్థులు కూడా వేడుకల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్భవ్ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సంజీవ్, కమిటీ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆర్‌డిఒ కృష్ణనాయక్

సమగ్ర అభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అంగన్‌వాడడీ కేంద్రాలలోని చిన్నారుల సమగ్రాభివృద్ధి నిమిత్తం ఆరు రోజుల పాటు నిర్వహించే జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా మూడవరోజు, గురువారం మార్గదర్శక, నిర్మాణాత్మక ఆటలు, నిర్వహించాల్సిన కృత్యాలపై అవగాహన కల్పించినట్లు ఎంఇఒ సిహెచ్.సక్సేనారాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న, సిడిపిఒ ఎం.శ్రీలక్ష్మి, ఆర్‌పిలు వై.కాశీవిశ్వనాథం, తమ్మిశెట్టి శ్రీనివాసు, ఎం.తిరుపతిరావు, సూపర్‌వైజర్లు ఎం.సరస్వతి, ఎం.భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాంగ అన్నసమారాధనకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం మురమండ గ్రామం సూర్యాపేటలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయ కమిటీకి హైదరాబాద్‌లో స్థిరపడిన మురమండ గ్రామస్తుడు నూలు నీలకంఠవెంకటకృష్ణాంజనేయప్రభాకరరావు, శాంతారత్నం దంపతులు రూ.50వేల విరాళం అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాంగ సంఘీయులు ప్రతి ఏటా నిర్వహించే కార్తీక వన సమారాధన నిమిత్తం దీన్ని అందించినట్టు తెలిపారు.ఈ సందర్భంగా దాతలను దేవాంగ సంఘ సభ్యులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను పండ్లు, స్వీట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ పూజారి మాడా వీరభద్ర స్వామి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ యర్రా బసవేశ్వర వరప్రసాద్, యర్రా సూర్యనారాయణ, చింతా రాజు, దొంతంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లలో చివటం ప్రథమం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామంలో ఇంటి పన్ను వసూళ్లు 96 శాతం పూర్తి చేసి, చివటం గ్రామం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ తెలిపారు. చివటం సర్పంచ్ ఈడుపుగంటి సత్యనారాయణ ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను వసూళ్లలో తక్కువ సమయంలోనే అత్యధిక వసూళ్లు పూర్తి చేసిన సందర్భంగా ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, పంచాయతీల విస్తరణాధికారి ఎ.ఆంజనేయశర్మ కార్యదర్శిని అభినందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారులు, పంచాయతీ బోర్డు సభ్యులు, గ్రామ ప్రజలందరి సహకారంతో లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం రూ.22,49,045లకు రూ.21,66,803 వసూలు చేశామన్నారు. తాను బదిలీపై వచ్చిన ఐదు నెలల కాలంలోనే సుమారు రూ.70 లక్షల పనులను పూర్తి చేశామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.30 లక్షల అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించి, తమ ఇంటి పరిసరాలతో పాటు, రహదారులను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని ప్రజలను కోరారు.

నేలటూరును సందర్శించిన టిబి అధికారి

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో నేలటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ వసుంధర సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నేలటూరు గ్రామపంచాయతీ గతేడాది బ్రాంజ్ నుంచి సిల్వర్ జోన్‌గా వెనుకబడిందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కళ్లే పరీక్షలు చేయించుకుంటే టిబిని నివారించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ తనూజ, ఐఎంఎ బృందం పాల్గొంది. టిబి సూపర్‌వైజర్ పోతురాజు, హెచ్‌వి ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ ఇ.సత్యనారాయణ ఎంఎల్‌హెచ్‌పి పూర్ణిమ, ఎఎన్‌ఎం దేవి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి అన్ని ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

శివరాత్రి సందర్భంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒ కృష్ణనాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో శివరాత్రి వేడుకలు సందర్భంగా సమన్వయ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, స్నాన ఘట్టాల వద్ద లైటింగ్, బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. యాత్రికులను అప్రమత్తం చేసేందుకు మైక్ అనౌన్స్‌మెంట్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

సమిశ్రగూడెం పంచాయతీకి కోమటిరెడ్డి సాయం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మండలం సమిశ్రగూడెం పంచాయతీకి పారిశుధ్య వాహనం, డస్ట్‌బిన్‌లు, షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సాయం చేసేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కోమటిరెడ్డి పట్టాభిరామ్ హామీ ఇచ్చారు. ఈ నిధులను సమీకరించడానికి కృషి చేసిన మంది కందుల దుర్గేష్‌కు జనసేన గ్రామ అధ్యక్షులు ఉప్పులూరి రామ్మోహన్ రావు, కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ఫీజులు వసూలు చేసే ల్యాబ్‌లపై చర్యలు

డిఎంహెచ్‌ఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రోగుల నుంచి ప్రయివేటు ల్యాబ్‌లు అధిక ఫీజులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు ల్యాబ్‌ల్లో రోగులకి అందుబాటులో అర్థమయ్యే విధంగా వైద్య పరీక్షలకు వసూలు చేసే ఫీజుల వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. వ్యాధి నిర్ధారణ నిపుణులచే ధ్రువీకరించిన నివేదికలను పేషెంటుకు అందజేయాలని పేర్కొన్నారు. ప్రతి ప్రైవేటు ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన ధరల జాబితాను అనుసరించాలని, ప్రజల భయాన్ని సొమ్ము చేసుకుని అధిక ఫీజులు తీసుకుంటే అటువంటి ఆస్పత్రులపై ఎపి ఎపిఎంసిఐ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం మండలంలోని కుమారపురం గ్రామంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమారపురం గ్రామానికి చెందిన బి.రామకృష్ణ భార్యను అదే గ్రామానికి టి.అనంతయ్య అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ సమయంలో అటుగా వస్తున్న రామకృష్ణ సోదరుడు బి.శ్రీనివాస్ అతన్ని ప్రశ్నించాడు. దీంతో వారి ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన అనంతయ్య కత్తి తీసుకొని శ్రీనివాస్‌పై దాడి చేశాడు. శ్రీనివాస్ తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం పిఠాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై రూరల్ ఎస్ఐ గుణశేఖర్ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం గౌరీపట్నం ఫ్లైఓవర్ వద్ద ఆగి ఉన్న వ్యానును వెనుక నుంచి స్కూటీ ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరుకు చెందిన ఎన్నేటి గోవిందు విజయవాడ వద్ద గల కండ్రిక గ్రామానికి చెందిన కల్లూరు వినయ్‌కుమార్ బైకుపై ఏలూరు నుంచి నర్సీపట్నం వెళ్తున్నారు. వీరు గౌరీపట్నం ఫ్లై ఓవర్ వద్దకు వచ్చేసరికి అక్కడ ఆగి ఉన్న ఐసర్ వ్యాన్‌ని ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కల్లూరు వినయ్‌కుమార్ మృతి చెందాడు. ఈ మేరకు ఎఎస్ఐ కె.నాగభూషణం కేసు నమోదు చేశారు.

ఈవ్‌టీజింగ్ కేసులో యువకుని అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

తనని ప్రేమించడం లేదని కోపంతో కళాశాలకు వెళ్లి ఆమె దాడి చేసిన ఘటనకి సంబంధించి కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేసినట్లు తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో గల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్న ఒక యువతిని నిందితుడు గొల్ల దిలీప్‌కుమార్ ప్రేమపేరుతో వేధించాడు. తనను ప్రేమించాలంటూ ఆమెను చేయికూడా చేసుకున్నాడు. అయినప్పటికీ యువతి నుంచి స్పందన లేకపోవడంతో బుధవారం మరోసారి కాలేజీకి వెళ్లి తనని ప్రేమించకపోతే వదిలేది లేదని, జీవితాన్ని పాడు చేస్తానని బెదిరించాడు. యువతిని కొట్టాడు. దీనిపై యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదవు చేసి నిందితుని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

మోటార్ వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రతా నియమాలు పాటించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాలలో 'శ్రద్ధ వహించండి' పేర జాతీయ రహదారి భద్రతా ప్రచారం నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని విద్యార్థులకు సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.సంపత్‌కుమార్ మాట్లాడుతూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యుక్త వయస్సు వారే ఉండటం దిగ్భ్రాంతి కలిగించే విషయమన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అన్ని నియమాలు పాటించి జాగ్రత్త గా ఉండాలని సూచించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాధికదేవి మాట్లాడుతూ రహదారి భద్రత గురించి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ వసంతభాను, డాక్టర్ శేఖర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

ఒటిపిలు ఎవరికీ చెప్పరాదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వివిధ బ్యాంకుల నుంచి, పలు కార్యాలయాల నుండి ఫోన్లు చేసి ఒటిపిలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పరాదని ఉండ్రాజవరం ఎస్ఐ జి.శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. చివటం, వేలివెన్ను గ్రామాల్లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఒటిపిలు, ఆధార్ నెంబర్లు అడుగుతారని, అటువంటి వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ వివరాలు తెలియజేయ రాదన్నారు. చోరీలను అరికట్టే విషయంలో ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. ఇంటి యజమానులు ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి బయట ప్రదేశాలకు వెళ్లాలంటే, ఇంటి తాళం బయటికి కనిపించకుండా వేయాలన్నారు. విలువైన వస్తువులు తెలిసిన వారి వద్ద భద్ర పరుచుకోవాలని, అవసరమైతే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.' అలా కోరిన వారి ఇళ్ల వద్ద ప్రత్యేక నిఘా పెడతామన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ మండలం వెస్ట్ గానుగూడెంలో ఆధునీకీకరించిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖను జోనల్ మేనేజర్ షాలిని మీనన్, రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ విశ్వేశ్వరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ షాలిని మీనన్ మాట్లాడుతూ వెస్ట్ గానుగూడెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ 1992 నుంచి కోరుకొండ మండలం, సమీప మండలాల గ్రామాలకు సేవలందిస్తుందన్నారు. నూతన శాఖ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవల కోసం ఎటిఎం సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ శాఖ ద్వారా వస్తు, విద్య, వాహన, వ్యవసాయ, బంగారం, పరిశ్రమలకు, రుణ సదుపాయంతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్స్, సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజెన్స్ సేవింగ్, ఖాతాలకు సంబంధిత సేవలు పొందొచ్చని తెలిపారు. అదేవిధంగా రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ విశ్వేశ్వరావు మాట్లాడుతూ ఖాతాదారులకు తక్కువ సమయంలో అధిక సేవలు అందించడం కోసం శాఖ ప్రాంగణమును ఆధునీకరించా మన్నారు. ఖాతాదారులు లావాదేవీలు చేసేట ప్పుడు తగిన జాగ్రత్తలు వహించాలని, సైబర్ నేరగాళ్ల వలలో పడకూడదని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. వీరితో పాటుగా ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న షాలినీమీనన్

కె.సావరం గ్రామం సిల్వర్ మెడల్‌కు ఎంపిక

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రధానమంత్రి టిబి ముక్త్ పంచాయతీల పరిశీలనలో భాగంగా జిల్లా వెరిఫికేషన్ బృందం గురువారం మండలంలోని కె.సావరంలో పర్యటించింది. ఇప్పటివరకు మండలంలోని దమ్మెన్ను, సత్యవాడ, కే సావరం గ్రామాలు వివిధ మెడల్స్‌కు ఎంపికయ్యాయి. అలాగే కె.సావరంలో పరిశీలన చేపట్టినట్లు జిల్లా అదనపు వైద్యాధికారి, జిల్లా క్షయ ఎయిడ్స్ అండ్ లెప్రసీ వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర, మెడికల్ కాలేజీకి చెందిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగం డాక్టర్ సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా కె.సావరం గ్రామం 2023లో బ్రాంజ్ మెడల్‌ను సాధించగా, 2024 సంవత్సరానికి సిల్వర్ మెడల్‌కు ఎంపికైందని తెలిపారు. 2024లో నమోదైన టిబి నిర్ధారణ పరీక్షలు, నమోదైన టిబి రోగుల వివరాలు, నిక్షయ్ పోషణ యోజన, పోషకాహార కిట్లు, 2023 సంవత్సర అవుట్ కమ్‌లను పరిశీలించి, సంతృప్తి వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.ఉషాదేవి, ఎస్‌టిఎస్.ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి పి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఎంఎల్‌హెచ్‌పి సంధ్యలక్ష్మి, ఎఎన్‌ఎం జ్యోతి వెరిఫికేషన్ బృదానికి రికార్డుల రిపోర్టులను సమర్పించారు.

భాష్యంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి భాష్యం స్కూల్లో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు మాట్లాడుతూ విద్యార్థికి తాను సాధించిన ప్రగతిని తెలియజేసి భవిష్యత్ జ్ఞాన సముపార్జనకు సమాయత్తం చేయడంలో భాగంగా ఒకటవ తరగతి, ఆరో తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు క్విజ్, వక్తత్వం, పాటలు, నృత్య పోటీలను నిర్వహించారు. విజేతలకు భాష్యం జోనల్ ఇంచార్జ్ వి. ఆంజనేయులు బహుమతులను అందించారు. విద్యార్థులు చదువుతో పాటుగా ఆటలు, తోటపని, పుస్తక పఠనం వంటివాటిలో ఖాళీ సమయాన్ని వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




పొలంబడిలో పాల్గొన్న అధికారులు

మేలైన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్

ప్రజాశక్తి- గోపాలపురం

మేలైన వ్యవసాయ పద్ధతులు ద్వారా సాగు చేసిన ఉత్పత్తులను ఇండి - గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా 129 దేశాల్లో విక్రయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు తెలిపారు. రాంపాలెంలో గురువారం నిర్వహించిన పొలంబడిలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు చేస్తే మేలైన ఉత్పత్తులు వస్తాయన్నారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డులలో నమోదు చేస్తారన్నారు. పొలాలను తనిఖీ చేసి సమగ్ర సస్యరక్షణ, పంటల సాగు యాజమాన్య పద్ధతలపై సూచనలు ఇస్తారన్నారు. దగ్గరలో ఉన్నటువంటి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలతో అనుసంధానం చేసి వారి ద్వారా తనిఖీలు నిర్వహించి పంట పండించిన తదుపరి పంట ఉత్పత్తులను పురుగుమందుల అవశేషాలు ఎంత ఉన్నాయో నాణ్యత నిర్ధారణకు పంపి ధ్రువీకరణ పత్రం ఇస్తారన్నారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యాన సహాయకులు రాజు, బిందు, మధు, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పట్ల ప్రేమతో మెలగాలి

ప్రజాశక్తి - నల్లజర్ల

ప్రతి కుమారుడు తల్లితండ్రుల పట్ల ప్రేమతో మెలగాలని జనసేన గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. నల్లజర్లలోని స్థానిక హర్ష మొబైల్ అధినేత మల్లిపూడి రాజారావు తన తండ్రి మల్లిపూడి భాస్కరరావు జ్ఞాపకార్థం ఆయన విగ్రహాన్ని ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని సువర్ణరాజు ఆవిష్కరించారు. అలాగే ఆయన జ్ఞాపకార్థం బరియల్‌గ్రౌండ్ వద్ద వాటర్ ట్యాంక్ నిర్మించారు, నల్లజర్లలో బాటసారులు కూర్చోవడానికి బల్లలు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారికి 1000 మొక్కలు పంపిణీ చేశారు. రాజారావు కుటుంబ సభ్యుల సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, అల్లాడ రాజారావు, మల్లిపూడి కృష్ణారావు, జనసైనికులు సాయితరుణ్, కిరణ్, నాని, పండు, గోపి పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన తిగిరిపల్లి సుబ్బారావు, మల్లిపూడి విజయభాస్కర్ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఆయన వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు జెవిఎస్.చౌదరి, కె.రామకృష్ణ, నాయకులు ఎస్.చిన్ని, ఎంఎస్.రామకృష్ణ, కె.శంకరం, టి.గోపి, కూటమి నాయకులు ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఒఎన్‌జిసి, డిప్యూటీ కలెక్టర్ ఎలక్ట్రోల్ రిటర్నింగ్ అధికారి భాగ్యవతి సూచించారు. గురువారం మండలంలోని, గోపాలపురంలో 259, 260, 261 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఓటర్లకు స్లిప్పులను త్వరితగతన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి లక్ష్మీదేవి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కె.నల్లరాజు, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, శ్రీనివాస్, జివివి.లక్ష్మీబాల కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని సుప్రియకు ఎంఎల్‌ఎ గొల్లపల్లి అభినందన

ప్రజాశక్తి - యానాం

యానాం లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని నేరెళ్ల సుప్రియ తమిళనాడు టెక్నికల్ బోర్డు నిర్వహించిన సెమిస్టర్ పరీక్షలో 700 మార్కులకు 698 మార్కులు సాధించి తమిళనాడు, పుదుచ్చేరి కళాశాలల టాపర్‌గా నిలిచింది. ఈ మేరకు గురువారం యానాం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ విద్యార్థి సుప్రియను తన నివాసంలో శాలువాతో సత్కరించి అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ పి.వేలాయుధం, ఇసిఇ హెచ్‌ఒడి నాగ అజ్మీర, సిఇ హెచ్‌ఒడి చంద్ర శేఖరన్, అధ్యాపకులు చెల్లి జ్ఞానివీరేంద్రనాథ్, రాధాకుమారి, శ్రీదేవి తదితరులు ఉన్నారు. అలాగే యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి తన కార్యాలయంలో సుప్రియను సత్కరించి అభినందించారు. కళాశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.



పాఠశాలకు సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు ప్రాథమిక పాఠశాల నెం-3కు ఉండ్రాజవరం మండలం పాలింగిలోని ఐడిబిఐ బ్యాంక్ బ్రాంచ్ ఫర్నిచర్, కంప్యూటర్ టేబుల్స్ కుర్చీల, ప్లాస్టిక్ కుర్చీలు, ఆరఒ వాటర్ ప్లాంట్‌ను అందించారు. రూ.55 వేల విలువైన ఈ సామగ్రిని హెచ్‌ఎం షేక్ మస్తాన్‌కు గురువారం స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రావులపాడు ఐడిబిఐ బ్రాంచ్ మేనేజర్ చంద్రు రమేష్, పాలింగి ఐడిబిఐ బ్రాంచ్ మేనేజర్ నూక కార్తీక్, అసిస్టెంట్ మేనేజర్లు కప్పల అశోక్, కె.కోటేశ్వరరావు, పి.వెంకటరాయుడు, నాగమణి, శాంతి పాల్గొన్నారు.

చిడిపిలో 65 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో సర్పంచి పొలడుగుల లక్ష్మణ రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 65 మందికి వైద్య పరీక్షలు చేశారు. నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న తాళ్లపూడి బ్రాంచ్‌కి చెందిన వైద్యులు వైద్య సేవలు అందించారు. 11 మందికి ఆపరేషన్ చేయాలని గుర్తించారు.

నేడు చాగల్లు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటల ప్రారంభమవుతుందని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. ఎంపిపి మట్టా వీరస్వామి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని జడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, నియోజవర్గ సాయి అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, వాకలపూడి

టెండరు నోటీసు

రి.క. నెం. 14/2025 — తేది. 19-02-2025

కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, వాకలపూడి గ్రామపంచాయితీకి సంబంధించి 2025-2026ఆర్థిక సంవత్సరం (ది.01-04-2025 నుండి ది.31-03-2026 వరకు) లో గ్రామపంచాయితీ నిధులతో పనిచేయుటకు ఈ దిగువ ఉదహరించిన విధముగా కాంట్రాక్టు సిబ్బంది సేవలకు మరియు గ్రామపంచాయితీకి అవసరమైన సామానులు సప్లయిచేయుటకు గాను సీల్డు టెండర్లు, ఈ దిగువ సంతకం చేసినే వారిచే గాని, లేదా వారి యొక్క అనుమతి పొందిన వారిచే గాని ది.04-03-2025వ తేదీ మంగళవారం మధ్యహ్నం12.00 గంటల వరకూ తీసుకొనబడి అదే రోజు అనగా ది.04-03-2025వ తేదీ మధ్యహనం 2.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరు దార్ల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. సీల్డు టెండర్లకు గాను చెల్లించవలసిన ధరావత్తు పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ, వాకలపూడి వారి పేరున చెల్లుబాటు అగు విధముగా డి.డి/ఎమ్.ఆర్. ద్వారా గాని చెల్లించి రశీదును టెండరు షెడ్యూలునకు జతపరచి సీల్డు కవరు ద్వారా టెండరు సమర్పించవలెను. టెండరు షెడ్యూల్స్ ది.03-03-2025వ తేదీ సాయంత్రం 4.00 గంటల వరకూ మాత్రమే ఇవ్వబడును. పై నిబంధనలు పాటించని టెండర్లు మరియు సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. టెండరు షెడ్యూలు రేటు, టెండరు షరతులు మరియు ఇతర విషయములు గ్రామపంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు వచ్చి తెలుసుకొనవలెను. గ్రామపంచాయితీ నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమములో బిల్లులు చెల్లించబడును. మరియు ఎటువంటి కారణములు చూపకుండానే టెండర్లు వాయిదా వేయుటకు గాని, రద్దు పరచుటకు గాని పంచాయితీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము గలదు.

వ.నెం.	ఐటమ్ వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1.	2025-2026 సం॥నకు శానిటేషన్ పని నిమిత్తం 59 మంది స్వీపర్లు సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
2.	2025-2026 సం॥నకు శానిటేషన్ పని నిమిత్తం 8 మంది డ్రయిన్ క్లీనర్సు సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
3.	2025-2026 సం॥నకు శానిటేషన్ పని నిమిత్తం 4గురు శానిటరీ మేస్త్రీలు సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
4.	2025-2026 సం॥నకు ప్రజారోగ్య శానిటేషన్ పని నిమిత్తం ముగ్గురు (3) ట్రాక్టర్ డ్రైవర్లు సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
5.	2025-2026 సం॥నకు గ్రా॥పంచాయతి ఏరియాలో ఇంటి పన్నులు వసూలుకు ఇద్దరు(2) కలక్షన్ సేవలు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
6.	2025-2026 సం॥నకు ఒక(1) కంప్యూటర్ ఆపరేటరు సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
7.	2025-2026 సం॥నకు ఒక(1) నైట్ వాచ్‌మెన్ సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
8.	2025-2026 సం॥నకు నలుగురు(4) పి.డబ్ల్యు.ఎస్ స్కీమ్ ఆపరేటర్ సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
9.	2025-2026 సం॥నకు వీది విధ్యుత్ దీపాలు రిపేర్లుకు ఇద్దరు(2) ఎలక్ట్రీషియన్ సేవలకు మనిషి ఒక్కింటికి	రూ. 100.00
10.	2025-2026 సం॥నకు స్టేషనరీ సామన్లు, బుక్స్ & ఫారమ్ సప్లై చేయుటకు	రూ. 500.00
11.	2025-2026 సం॥నకు రక్షిత మంచినీరు సరఫరా విడిభాగములు సప్లై చేయుటకు	రూ. 500.00
12.	2025-2026 సం॥నకు పబ్లిక్ హెల్త్ కలరా మందులు బ్లీచింగ్, ముగ్గు, ఫినాయిల్, దోమలమందు, ఇతర కలరా మందులు సప్లైచేయుటకు	రూ. 500.00
13.	గుల్లముగ్గు సప్లయి కొరకు	రూ. 200.00
14.	2025-2026 సం॥నకు ఎలక్ట్రికల్ విడిభాగాలు, ఎల్.ఇ.డి.లైట్లు, ఫిటింగ్‌లు (ఎల్.ఇ.డి. డ్రయివర్స్, ఎల్.ఇ.డి.ఫ్యానల్స్) మీటర్ బాక్సులు వగైరాలు సప్లైచేయుటకు	రూ. 500.00
15.	2025-2026 సం॥నకు పారిశుధ్య పనిముట్లు, రిక్షాలు, ట్రాక్టర్లకు అవసరమగు విడిభాగాలు సప్లై చేయుటకు	రూ. 500.00

నోటు: సదరు టెండర్లు రద్దు చేయుటకు మరియు ఆమోదించుటకు గ్రామపంచాయితీకి అధికారము కలిగియుండును. అవసరమైనచో సహేతుకమైన కారణంతో సదరు టెండర్లు తిరస్కరించబడును మరియు వాయిదా వేయబడును. సదరు టెండర్లు పంచాయతీ తీర్మాణమునకు లోబడి ఆమోదించబడును.

సం/- **పి.పాండురంగారావు**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ, వాకలపూడి
కాకినాడ రూరల్ మండలం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి 33/11కెవి సబ్ స్టేషన్ మరమ్మత్తులు నిమిత్తము శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దేవరపల్లి సబ్ స్టేషన్ పరిధి లో 11 కెవి అచ్చియ్యపాలెం ఫీడర్, 11కెవి గొల్లగూడెం ఫీడర్, 11 కెవి దేవరపల్లి ఎంహెచ్‌క్యూ ఫీడర్, 11కెవి బంధపురం ఫీడర్, 11 కెవి ఇండస్ట్రీల్ ఫీడర్, 11కెవి మార్కెట్ ఫీడర్‌లకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తుఆన్నమని ఎపిఇపిడిసిలె ఇఇ నారాయణ అప్పారావుత తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దేవరపల్లి, బంధపురం, గొల్లగూడెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. అగ్రికల్చర్ సప్లై ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6గంటల వరకూ ఉంటుందన్నారు.

కడియం : మురముండ 33/11కెవి సబ్ స్టేషన్ నుంచి సరఫరా అయ్యే మాధవరాయుడు పాలెం11 కెవి ఫీడర్‌కు కొత్త పోల్స్ వేయుట నిమిత్తం విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపేస్తున్నట్టు రాజమహేంద్రవరం రూరల్ ఇఇ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. మాధవరాయుడు పాలెం, దామిరెడ్డి పల్లి గ్రామాలలోని వ్యవసాయ బోర్లకు, గృహాలకు అంతరాయం కలుగునన్నారు.

గోకవరం : గోకవరం మండలంలోని 11కెవి ఆర్ అండ్ ఆర్ కాలనీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తమై శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరక ఆర్అండ్ఆర్ కాలనీ, పూడిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ, వీరలంకపల్లి, పెంటపల్లి, రంప ఎర్రంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలపేస్తామన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు.

ఉండ్రాజవరం : మండలంలోని ఉండ్రాజవరం సెక్షన్, ఉండ్రాజవరం సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కెవి, 11కెవి సత్యవాడ ఫీడర్ ట్రీ కటింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సత్యవాడ, ఉండ్రాజవరం గ్రామాల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు సరఫరా తాత్కాలికంగా నిలిపివే యనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణఅప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.